సాక్షి
అనకాపల్లి
శనివారం । 18 । మే । 2024



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ నగరంలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు.



శ్రీవారికి వారాంతపు పూజలు

విశాఖ రుషికొండలోని శ్రీవారి దివ్యక్షేత్రంలో శుక్రవారం వారాంతపు పూజలు ఘనంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.8/26.2

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

మోదకొండమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు

- ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు తదితరులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శుక్రవారం నిర్వహించి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. ఈనెల 19న పండగ చాటింపు, 21న అమ్మ వారి కొలువు సతకం పట్టు వద్ద ఉంటుందన్నారు. వచ్చేనెల 18న అంగరంగ వైభవంగా అమ్మవారి పండగ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 19న అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ఉంటుందన్నారు. మాలధారణ చేసే భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా మాలలు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్య నాయుడు, కుప్పిలి భవాని, శంకర్, ధర్మిశెట్టి అప్పారావు, డిల్లీ నానాజీ, పల్లేల రాము, ద్రాక్షారపు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని సమ్మర్ స్పెషల్స్



తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరికొన్ని వన్‌వే సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్–సోలాపూర్(01452) వన్‌వే సమ్మర్ స్పెషల్ ఈ నెల 20 సోమవారం ఉదయం 4.30 గంటలకు బయలుదేరి అదే రోజు ఉదయం 11.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.45 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 7 గంటలకు సోలాపూర్ వెళ్తుంది. భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (01056) వన్‌వే సమ్మర్ స్పెషల్ ఈ నెల 20 సోమవారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.53 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి వెళ్తుంది.

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్ (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బహు భాషా గ్రంథావిష్కరణ

కంచరపాలెం (విశాఖ): జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహు భాషా గ్రంథావిష్కరణ జరిగింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన 'సమాగమ్'–బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్. దీప్తి, గౌరీనాయుడు, డి. కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సీజన్ మరింత తీయగా..





నాట్లు వేస్తున్న చెరకు రైతులు

- చెరకు సాగు పెరిగితేనే క్రషింగ్ లక్ష్యసాధన సాధ్యం
- రాయితీపై 40 లక్షల ఒంటికన్ను ముచ్చు విత్తనాలు అందిస్తున్న గోవాడ సుగర్స్
- ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు
- ఈ ఏడాది 3 లక్షల టన్నుల చెరకు గానుగాడే దిశగా ముందస్తు చర్యలు

చోడవరం: ఈ ఏడాది చెరకు సాగు విస్తీర్ణం పెంచేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ముందస్తు చర్యలు చేపట్టింది. గత ఏడాది చెరకు లేక క్రషింగ్ లక్ష్యం చేరుకోలేకపోవడంతో ఈ ఏడాది ఆ సమస్య రాకుండా ముందస్తుగా అప్రమత్తమయింది. రాయితీలు కల్పిస్తూ రైతులు చెరకు సాగుకు మొగ్గు చూపేలా కృషి చేస్తోంది. పెట్టుబడులు పెరిగిపోవడం, గిట్టుబాటు ధర దక్కకపోవడంతోపాటు.. భూ సారంలో మార్పులు, వాతావరణ కాలుష్యం కారణంగా చెరకు దిగుబడి తగ్గిపోవడంతో జిల్లాలో చెరకు విస్తీర్ణం గత పదేళ్లుగా తగ్గుతూ వస్తోంది. జిల్లాలో ఉన్న నాలుగు చక్కెర ఫ్యాక్టరీల్లో మూడు మూతబడిపోవడం, బెల్లం ఎగుమతులు కూడా అనుకున్న స్థాయిలో లేకపోవడంతో చెరకు సాగు తగ్గిపోయింది. అయితే ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా రైతులకు అండగా నిలవడంలో గోవాడ సహకార చక్కెర కర్మాగారం ఎక్కడా వెనకడుగు వేయలేదు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.80 కోట్ల వరకు సహకారం అందించడంతో ఈ ఫ్యాక్టరీ ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.150 కోట్ల వరకు అప్పుల ఊబిలోకి నెట్టినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఏదో రూపంలో గ్రాంట్‌ను ఇస్తూ ఫ్యాక్టరీని బతికించుకుంటూ వచ్చింది.

కనీసం 3 లక్షల టన్నులైనా గానుగాడాలని..

గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి ఐదు లక్షల టన్నుల చెరకు గానుగాడే సామర్థ్యం ఉంది. ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లోనైనా చేరుకోవాలన్న ఆశయంతో యాజమాన్యం ముందస్తుగా సాగు విస్తీర్ణం పెంచే చర్యలు చేపట్టింది. ఈ ఏడాది కనీసం 3 లక్షల టన్నులైనా గానుగాడాలని భావిస్తోంది. ఆ దిశగా చెరకు సరఫరా జరగాలంటే ఫ్యాక్టరీ పరిధిలో ఇప్పుడున్న విస్తీర్ణం కంటే మరో 5 వేల ఎకరాల్లో సాగు పెరగాల్సి ఉంది. అందుకే రైతుల్లో సాగుపై ఆసక్తి పెంచేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఫ్యాక్టరీ పరిధిలో 25 నుంచి 30 వేల ఎకరాల్లో చెరకు సాగు జరుగుతోంది. పాత రకం వంగడాలు నామమాత్రంగా దిగుబడి ఇస్తుండటంతో కొత్త రకాలపై రైతుల్లో అవగాహన పెంచి, ఆ విత్తనాన్ని రైతులకు అందిస్తోంది. రైతులు సాగులో వస్తున్న సాంకేతిక పద్ధతుల వైపు మొగ్గుచూపేలా వారిలో చైతన్యం పెంచేందుకు ఇప్పటికే అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే పద్ధతులను వారికి తెలుపుతోంది. అనకాపల్లి, కొండెంపూడి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు చెరకులో కొత్త వంగడాలు, సాగులో కొత్త విధానాలను తెచ్చి రైతులు ఆచరించే విధంగా ఇప్పటికే చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాయి. గత కొంత కాలంగా ఒంటికన్ను ముచ్చుతో శ్రీసాగు విధానంలో కేవలం అతి కొద్ది మంది మాత్రమే చెరకు తోటల పెంపకం చేస్తున్నారు. ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఫ్యాక్టరీ కూడా రైతులకు అవగాహన సదస్సులు పెట్టింది. ఈ విధానంలో సాగు చేసేందుకు ఎక్కువ మంది సుముఖత వ్యక్తం చేయడంతో 2024–25 క్రషింగ్ సీజన్‌కు 40 లక్షల ఒంటికన్ను ముచ్చును ఫ్యాక్టరీ రైతులకు అందించేందుకు పలు ప్రాంతాల్లో నర్సరీలు పెంచి, అక్కడ నుంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. మరోపక్క పాత చెరకు వంగడాలు ఎక్కువగా తెగుళ్ల బారిన పడి, భూమిలో సారం తగ్గిపోయి దిగుబడి పడిపోవడంతో కొత్త వంగడాలను కూడా రైతులకు ఇస్తున్నారు. విత్తనంపై 50 నుంచి 80 శాతం సబ్సిడీ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా సబ్సిడీపై ఎరువులు కూడా అందిస్తున్నారు.

సరఫరాకు సిద్ధంగా ఉంచిన ఒంటికన్ను ముచ్చు విత్తనం

చెరకులో కొత్త రకం వంగడాలు

ఇప్పటి వరకు రైతులు పాత రకాలు వేసినవే మళ్లీ మళ్లీ వేయడంతో భూమిలో సారం తగ్గి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీనితో కొత్త రకాల వైపు ఆసక్తి చూపుతున్నారు. చెరకులో కొత్తగా 2009ఎ 107, 87ఎ298, 2003వి46, 2006ఎ81, 2006ఎ 252 రకాలు వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. దీనితో ఈ రకాల్లోనే ఒంటికన్ను ముచ్చు విత్తనాన్ని గోవాడ ఫ్యాక్టరీ తయారు చేస్తోంది.


సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని విధాలుగా చర్యలు



ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం పెరిగేలా.. అందుకు తగ్గట్టుగా చెరకు సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు చేపట్టాం. ఈ ఏడాది 40 లక్షల ఒంటికన్ను ముచ్చు విత్తనాలను రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధం చేశాం. ఒక మొక్క తయారీకి రూపాయి 70 పైసలు ఖర్చవుతుండగా.. ఫ్యాక్టరీ 80 పైసలు భరిస్తోంది. రైతులు 90 పైసలు చెల్లించే విధంగా ఈ విత్తనాన్ని సరఫరా చేస్తున్నామన్నాం. నాటు విత్తనాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈ నెలలో మరింత ఎక్కువగా నాట్లు వేసేలా రైతులకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం.

– సన్యాసినాయుడు, గోవాడ సుగర్స్ ఎండీ

విశాఖ జూకి కొత్త అతిథులు



అల్డబ్రా జాయింట్ టార్టాయిస్



గ్రీన్ వింగ్ మెకావ్.



మీర్‌కాట్..

- సీజెడ్‌ఏ అనుమతులు
- త్వరలోనే సందడి చేయనున్న వన్యప్రాణులు

ఆరిలోవ (విశాఖజిల్లా): విశాఖలో ఇందిరాగాంధీ జూ పార్కుకు కొద్దిరోజుల్లో మరికొన్ని కొత్త వన్యప్రాణులను తీసుకురావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్నింటిని తీసుకురావడానికి సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా (సీజెడ్‌ఏ) అనుమతులు లభించాయి. మరి కొన్నింటిని తీసుకురావడానికి అనుమతులు రావాల్సి ఉంది. కొన్నాళ్లుగా ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు ఇతర జూ పార్కుల నుంచి కొత్త జంతువులు, అరుదైన పక్షులను అధికారులు తరచు తీసుకొస్తున్నారు. గత నెల 27న కోల్‌కతాలోని అలీపూర్ జూ పార్కు నుంచి జంతుమార్పిడి విధానం ద్వారా జత జిరాఫీలు, రెండుజతల ఏషియన్ వాటర్ మానిటర్ లిజర్డ్స్, జత స్కార్లెట్ మకావ్ (రంగురంగుల పక్షి)లను ఇక్కడకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా వన్యప్రాణులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇప్పుడు మరికొన్ని వన్యప్రాణులను కొద్ది రోజుల్లో తీసుకురానున్నారు. బెంగళూరు జూ నుంచి మిలటరీ మెకావ్, రెడ్‌నెక్డ్ వాలిబీ, స్పైరల్ మంకీస్, మార్మోసెట్ మంకీస్, గ్రీన్ వింగ్ మెకావ్‌లను నెల రోజుల్లో తీసుకొచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి కోసం జూలో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు.

జర్మనీ నుంచి అల్డబ్రా జాయింట్ టార్టాయిస్‌లు

జర్మనీ నుంచి 12 అల్డబ్రా జాయింట్ టార్టాయిస్‌లను విశాఖ జూకు తీసుకురానున్నారు. ఈ జాతి తాబేళ్ల జీవితకాలం వంద సంవత్సరాలు. ఇవి అరుదైనవి. మనదేశంలో ఇవి అరుదుగా కనిపిస్తాయని అధికారులు చెబుతున్నారు. వాటిని ఇక్కడకు తీసుకురావడానికి సీజెడ్‌ఏ అధికారుల అనుమతి లభించింది. వీటిని ఇక్కడకు తీసుకొస్తే వందేళ్ల వాటి జీవితకాలంలో ఆ జాతి సంతతి వృద్ధి చెందుతుంది. ఇతర జూ పార్కుల నుంచి జంతుమార్పిడి ద్వారా కొత్త వన్యప్రాణులను ఇక్కడకు తీసుకురావడానికి ఎక్కువగా అవకాశాలు కలుగుతాయని అధికారులు ఆశిస్తున్నారు. వీటితోపాటు అహ్మదాబాద్ జూ పార్కు నుంచి వివిధ రకాల అరుదైన పక్షులను తీసుకొచ్చేందుకు సీజెడ్‌ఏకి ప్రతిపాదనలు పంపించారు. అవికూడా వస్తే విశాఖ జూకి మరింత కొత్తదనం లభించనుంది.

త్వరలోనే కొత్త వన్యప్రాణులు



విశాఖ జూకి ఒకటి, రెండునెలల్లో కొత్త వన్యప్రాణులను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బెంగళూరు జూ నుంచి మీర్‌కాట్, రెడ్ నెక్డ్ వాలబీ, స్పైరల్ మంకీస్, మర్మోసెట్స్, గ్రీన్ వింగ్డ్ మకావ్ తదితర జాతులుతో పాటు జర్మనీ నుంచి అల్డబ్రా జాయింట్ టార్టాయిస్‌లను ఇక్కడికి తీసుకురావడానికి సీజెడ్‌ఏ అనుమతులు లభించాయి. అహ్మదాబాద్ జూ నుంచి మరికొన్ని అరుదైన పక్షులను తీసుకురావడానికి సీజెడ్‌ఏకి ప్రతిపాదనలు పంపించాం. సీజెడ్‌ఏ అనుమతులు వచ్చిన వెంటనే వాటిని తీసుకొస్తాం. గతనెలలో లీపూర్ జూ నుంచి ఇక్కడకు తీసుకొచ్చిన జిరాఫీలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. జూలో అరుదైన వన్యప్రాణులను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్, ఇందిరాగాంధీ జూ పార్కు, విశాఖపట్నం

రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్ వెంటే

- ఆయనకు అండగా నిలవాలనే భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు (విశాఖ): జూన్ 4 వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి చరిత్ర సృష్టించబోతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు మేలు చేసిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని భారీ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. చంద్రబాబు కూటమికి ఓటమి తప్పదని స్పష్టంచేశారు. ఆమె శుక్రవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మహిళలంతా జగన్‌ను సోదరుడిలా భావిస్తున్నారని, మరో ముప్పై ఏళ్లు ఈ రాష్ట్రం జగన్ నాయకత్వంలో నడవాలని కోరుకుంటున్నారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు వదిన పురందేశ్వరితో కలిసి అబద్ధాల హామీలు, కుట్రలతో అధికారులను మార్చి రాష్ట్రంలో అశాంతిని రగిల్చారన్నారు. నర్సీపట్నంలో, కృష్ణా, పల్నాడు జిల్లాల్లో మహిళలపైన, వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికిన ప్రజలపైనా దాడులు చేశారన్నారు. బాబు హయాంలో మహిళల హత్య, దాడులు, విజయవాడలో కాల్‌మనీ రాకెట్లో మహిళలను చిత్రహింసలకు గురి చేసిన ఘటనలు ప్రజలందరికీ తెలుసన్నారు.

తెరుచుకున్న గంగవరం పోర్టు



అదానీ గంగవరం పోర్టు గేట్లు తెరుచుకోవడంతో రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు

- చర్చలు ఫలించడంతో కార్మికుల సమ్మె విరమణ
- స్టీల్‌ప్లాంట్‌కు యథావిధిగా బొగ్గు సరఫరా



గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలిస్తున్న బొగ్గు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు గేట్లు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. పోర్టులో పని చేస్తున్న ఉద్యోగులు గురువారం రాత్రి నుంచి విధులకు హాజరయ్యారు. బొగ్గు రవాణా జోరుగా సాగడంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊపిరి పీల్చుకుంది. తమ డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులు గత నెల 10వ తేదీ నుంచి పోర్టు ప్రధాన గేటు వద్ద ఆందోళన చేయడం తెలిసిందే. కార్మికులకు ప్రతి నెలా కనీస వేతనం కింద రూ.36 వేలు చెల్లించాలని, విధి నిర్వహణలో ఉన్న కార్మికులు మృతి చెందితే రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నష్టపరిహారం కింద రూ.50 లక్షలు ఇచ్చి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశం మేరకు నగర సీపీ రవిశంకర్ పోర్టు యాజమాన్య ప్రతినిధులు, నిర్వాసిత కార్మిక సంఘ నాయకులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఎట్టకేలకు గురువారం రాత్రి చర్చలు ఫలించాయి. ఒక్కో కార్మికునికి రూ.27 లక్షలు ఇచ్చి వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయడానికి పోర్టు యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు సమ్మె విరమించారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి పోర్టులో కార్యకలాపాలు యథావిధిగా సాగాయి. స్టీల్‌ప్లాంట్‌కు ఇక్కడి నుంచి కన్వేయర్ బెల్ట్ ద్వారా బొగ్గు సరఫరా చేశారు.

సమన్వయలోపంతో 'షాక్'!

- బలవుతున్న విద్యుత్ ఉద్యోగులు
- మరమ్మతుల సమయంలో సమాచార లోపం
- సరఫరా నిలిపివేయడంలో జాప్యం కారణంగా ప్రమాదాలు
- రెండు నెలల్లో ఇద్దరు ఈపీడీసీఎల్ ఉద్యోగుల మృతి
- విశాఖ సర్కిల్‌లో ఈపీడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం





గాలి భీమవరంలో మృతి చెందిన హెల్పర్ వెంకట రమణ(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం :

- ఏప్రిల్ 25న మునగపాక మండలం చూచుకొండలో విద్యుత్ సమస్యని పరిష్కరిస్తుండగా షాక్‌కు గురై ఈపీడీసీఎల్ హెల్పర్ పీతల శివన్నారాయణ మృతి చెందారు.
- ఈ నెల 16న సబ్బవరం మండలం గాలి భీమవరంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఈపీడీసీఎల్ హెల్పర్ గొంప వెంకటరమణ షాక్‌కు గురై మృత్యువాత పడ్డారు.

పై రెండు మరణాలకు విద్యుత్ అధికారుల మధ్య సమన్వయలోపమే ప్రధాన కారణమన్నది స్పష్టమవుతోంది. మరమ్మతుల సమయంలో సమాచార జాప్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించాల్సిన ఇంజినీరింగ్ సిబ్బంది.. వసూళ్లపైన మాత్రమే దృష్టి సారిస్తుండటంతో తరచుగా ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. వరుసగా రెండు నెలల్లో ఇద్దరు ఈపీడీసీఎల్ సిబ్బంది మృత్యువాత పడటానికి కారణం.. విశాఖ సర్కిల్ అధికారులు నిర్లక్ష్యమేనన్నది స్పష్టమవుతోంది.

ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. సంబంధిత లైన్‌మెన్ హెల్పర్ సహాయంతో మరమ్మతులు చేస్తారు. ఈ సమయంలో సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి.. ఫలానా ఏరియాకు సంబంధించిన విద్యుత్ సరఫరా నిలిపివెయ్యాలని చెబుతుంటారు. వీధుల్లో సమస్య తలెత్తితే.. సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా నిలిపేస్తారు. ఇక్కడే సిబ్బంది వహిస్తున్న నిర్లక్ష్యం వారి పాలిట యమపాశంలా మారిపోతోంది. లోపం తలెత్తిన లైన్ మరమ్మతులు పూర్తయ్యాయా లేదా.? అనే అంశంపై స్పష్టత రాకుండానే విద్యుత్ సరఫరా ఇచ్చేస్తుండటం వల్ల ఈ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి.

ప్రతి నెలా ప్రమాదమే..

కేవలం ఈపీడీసీఎల్ సిబ్బంది మాత్రమే కాకుండా.. తరచూ ఏదో ఒక చోట విద్యుదాఘాతాలు సంభవిస్తున్నాయి. ఏప్రిల్ 14న అచ్యుతాపురం మండలం కొండకర్లలో విద్యుదాఘాతానికి గురై ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందగా.. మార్చిలో గాజువాకలో విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. పీఎం పాలెంలో ఓ భవనంలో ప్లంబింగ్ చేస్తుండగా.. ప్రమాదానికి గురై వ్యక్తి మృత్యువాత పడ్డారు. ఇలా ప్రతి చోటా ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం చలనం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో విద్యుత్ ప్రమాదాలపై కనీస అవగాహన చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం

ప్రమాదాల నివారణకు సంబంధించి విశాఖపట్నం ఈపీడీసీఎల్ సర్కిల్ అప్రమత్తంగా వ్యవహరించడంలో నిర్లక్ష్యంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సబ్బవరం ప్రాంతంలో ఈపీడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు రైతుల వద్ద నుంచి విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.లక్షల్లో వసూళ్లపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు తప్ప.. లైన్ల పరిశీలన, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత.. తదితర అంశాల్ని మాత్రం పూర్తిగా విస్మరిస్తున్నారు. ఎవరైనా.. విద్యుత్ కనెక్షన్ కావాలంటే.. కచ్చితంగా జేబులు నింపాల్సిందేనన్నట్లుగా అడ్డగోలుగా వ్యవహిస్తున్నారు. ఉన్నతాధికారులకు సైతం డబ్బులు ముట్టజెప్పాలంటూ రైతులు, వినియోగదారుల్ని ముప్పతిప్పలు పెడుతున్నారే తప్ప.. విద్యుత్ వ్యవస్థని సరిదిద్దే ఆలోచన మాత్రం.. ఈపీడీసీఎల్ విశాఖసర్కిల్ ఇంజినీరింగ్ అధికారుల్లో మాత్రం కనబడటం లేదన్నది ఈ మధ్య కాలంలో జరుగుతున్న ప్రమాదాల ద్వారా స్పష్టమవుతోంది.

ప్రభుత్వ కాలేజీల్లో పిల్లల్ని చేర్పండి

వసతులు, బోధనపై అధ్యాపకుల ఇంటింటా ప్రచారం


జెడ్.కొత్తపట్నంలో విద్యార్థి తల్లిదండ్రులకు కరపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

రావికమతం: అత్యుత్తమ బోధన, ఉచిత సౌకర్యాలున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే మీ పిల్లలను చేర్పించాలంటూ కొత్తకోట జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం పలు గ్రామాల్లో టెన్త్ పాసైన పిల్లల ఇంటికి వెళ్లి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలతో కార్పొరేట్ కాలేజీలను మించిన స్థాయిలో ఉన్నాయని వివరించారు. జెడ్.కొత్తపట్నం, దొండపూడి, టి.అర్జాపురం, నాయుడుపాలెం గ్రామాల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఓసారి తమ కళాశాలను సందర్శించి, నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో ఉన్న వసతులు, ప్రయోజనాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభించినట్లు వెల్లడించారు. టెన్త్ పాసైన విద్యార్థులు తమ మార్క్స్ మెమో, ఆధార్ తదితర ధ్రువపత్రాలు తీసుకొచ్చి, అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు.

వరాహ నదిలో బయటపడిన అమ్మవారి విగ్రహం


నదీ గర్భంలో బయటపడిన అమ్మవారి విగ్రహం


పూజలు చేస్తున్న స్థానిక మహిళలు

ఎస్.రాయవరం: పెదఉప్పలం శివారు బసవపాడు సమీపంలో వరాహనదిలో బయటపడిన గంగమ్మతల్లి విగ్రహానికి మహిళలు శుక్రవారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. నదిలో రాయికి పాదంతో కూడిన ఆకారం కనిపించడంతో ముందుగా చూసిన యర్రంశెట్టి గంగరాజు బసవపాడు గ్రామస్తులను పిలిచి ఇసుకలో కప్పి ఉన్న అమ్మవారి రాతి ప్రతిమను వెలికి తీశారు. సుమారు 500 కిలోల బరువున్న రాయిపై అమ్మవారి విగ్రహం దర్శనమిచ్చింది. దుర్గమ్మ ఆకారంలో ఉన్న ఈ అమ్మవారు గంగపారే నదిలో దొరకడంతో గంగమ్మతల్లిగా పూజలు మొదలు పెట్టారు. నది గర్భంలో పురాతన విగ్రహం బయటపడటంతో తమ ప్రాంతాన్ని సంరక్షించడానికి అమ్మవారే బయటకు వచ్చారని స్థానికులు ఆనందంగా చెప్తున్నారు. విషయం తెలుసుకున్న పరసర గ్రామాలైన పెదఉప్పలం, వెంకటాపురం, లింగరాజుపాలెం, బసవపాడు, వమ్మవరం, అగ్రహారం, ఎస్.రాయవరం శివారు అగ్రహారం, ఎస్.రాయవరం తదితర గ్రామాలకి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున నది వద్దకు చేరుకున్నారు. అమ్మవారి దర్శించుకుని, పూజలు చేశారు. అప్పటికే బసవపాడు గ్రామానికి చెందిన పలువురు భక్తులు అమ్మవారు బయటపడిన ప్రదేశంలో చలువ పందిరి, భక్తులకు నీడనిచ్చేలా టెంట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు


నాగేంద్ర(ఫైల్)

దేవరాపల్లి: స్థానిక కొల్లూరి వారి వీధికి చెందిన బాలుడు నాగేంద్ర(12) కనిపించట్లేదని తండ్రి దీవి ఈశ్వరరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. వివరాలు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగేంద్ర బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీశారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన బాలుడు తన పేరు తప్ప మరే ఇతర వివరాలు చెప్పలేడని పోలీసులకు కుటుంబ సభ్యులు తెలిపారు. చామనఛాయ రంగు కలిగిన బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయినప్పుడు ఎరుపు రంగు చొక్కా, ఎరుపు రంగు షార్ట్ ధరించాడు. బాలుడి ఆచూకీ లభించిన వారు 6369801257, 9440796092 నంబర్లలో సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

అపురూపం.. చరిత్రకు సాక్ష్యం

- ఏయూ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల పరిధిలో మ్యూజియంలు
- విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే కేంద్రాలు
- నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం


వృక్షశాస్త్ర మ్యూజియంను సందర్శిస్తున్న విదేశీయులు(ఫైల్)


హెర్బేరియంలో ఎండిన రూపంలో మొక్కలు


వృక్షశాస్త్రంలో విత్తనాలను నిల్వచేస్తున్న విధానం


మ్యూజియంలో చిరుత కళేబరం

ఏయూక్యాంపస్: కళాఖండాలు.. చారిత్రక వస్తువులు.. శాస్త్రీయ నమూనాల వంటి వస్తువులను సేకరించి ప్రదర్శించే ప్రదేశం మ్యూజియం. ప్రజలు తిలకించడానికి, అధ్యయనం చేయడానికి ఈ కళాఖండాలు అందుబాటులో ఉంటాయి. నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం. మ్యూజియంలు సమాజానికి ఎలా దోహదపడతాయనే దాని గురించి అవగాహన కల్పించడం, సాంస్కృతిక మార్పిడి, వైవిధ్యం, సమగ్రతను ప్రోత్సహించడం ఈ డే ఉద్దేశం. ఈ సందర్భంగా ఏయూ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల పరిధిలోని పలు మ్యూజియం విశేషాలు తెలుసుకుందాం.

◆ ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ప్రధానమైన విభాగాల్లోని వృక్షశాస్త్రం ఒకటి. ఈ విభాగానికి సంబంధించి మ్యూజియం, హెర్బేరియం ఉన్నాయి. సహజంగా ఉండే మొక్కలు, విత్తనాలు ఫార్మాడీహైడ్‌లో భద్రపరిచి ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. ఇక్కడ 500లకు పైగా సముద్ర తీరం, అడుగు భాగంలో లభించే మొక్కలు, నేలపై లభించే మొక్కలు, విత్తనాలు వంటివి విద్యార్థుల కోసం భద్రపరిచారు. వీటితో పాటు వివిధ జాతుల అరుదైన చెక్కలు, అరుదైన వృక్ష శిలాజాలు కూడా ఇక్కడ ఉన్నాయి. అలాగే హెర్బేరియంలో 25 వేలకు పైగా నమూనాలు ఉన్నాయి.

◆ ఏయూలోని జీవశాస్త్ర విభాగంలోని మ్యూజియంలో సుమారు 1,500లకు పైగా జీవులకు సంబంధించిన నమూనాలు ఉన్నాయి. చిరుత, జింక, తాబేలు, పక్షులు, పాములు ఇలా అనేక జీవుల కళేబరాలను టాక్సీ డమ్మీ విధానంలో ప్రత్యేక రసాయనాలు ఉపయోగించి ఇక్కడ భద్రపరిచారు. నేలపై, నీటిలో, గాలిలో సంచరించే అన్ని జీవుల కళేబరాలు మనకు దర్శనమిస్తాయి. అరుదైన, అంతరించే జీవులను కూడా ఇక్కడ మనం చూసే అవకాశం ఉంది.

◆ ఆర్ట్స్ కళాశాల పరిధిలోని ఆంత్రపాలజీ విభాగంలో ప్రత్యేకంగా మ్యూజియం ఉంది. మానవ పరిణామ క్రమాన్ని వివరించడం, ప్రజల జీవనం తెలిపే విధంగా ఈ మ్యూజియంను తీర్చిదిద్దారు. ప్రాచీన కాలంలో ఉపయోగించిన పనిముట్లు, వారి సంస్కృతి, కళలు, జీవన విధానం, అలంకరణ వస్తువులు వంటివి ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇటీవల ఏయూను సందర్శించిన నాక్ నిపుణుల బృందం సైతం వీటిని పరిశీలించి ప్రశంసించింది.

◆ గత చరిత్రను మన ముందుంచే విధంగా చరిత్ర విభాగంలో మ్యూజియం ఉంది. ఇక్కడ చారిత్రక నాణేలు, ఇనుప రేకులపై రాసిన శాసనాలు, చారిత్రక శిలలు, శిల్పాలు, చారిత్రక ఆనవాళ్లుగా నిలిచే అనేక వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. భారతీయ ఆలయాలు, శిల్ప సంస్కృతులను తెలిపే చిత్రాలు ఇక్కడ మనకు కనిపిస్తాయి. కాగా.. చారిత్రక సంపదను చెక్కు చెదరకుండా భద్రపరచడం ఎంతో క్లిష్టమైన అంశం. ఈ విషయంలో ఏయూ అధికారులు ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. శతాబ్దానికి చేరువవుతున్న ఏయూకు ఈ మ్యూజియం అదనపు ఆభరణాలు.


చరిత్ర విభాగంలో భద్రపరిచిన శిల్పాలు






జువాలజీ విభాగంలోని మ్యూజియంలో వివిధ జంతువుల కళేబరాలు


మ్యూజియంలో హైనా, అలుగు జంతువుల కళేబరాలు

● సూర్యోదయం.. సప్తవర్ణ శోభితం



తూర్పు తలుపు నెట్టుకుని సూరీడు తన రాకను లోకానికి తెలిపే ముందు ఉదయం వాకిట సప్తవర్ణ శోభితం. నేల నుంచి నింగికి కిరణాలనే నిచ్చెనగా చేసుకున్న సమయాన ఆకాశానికి ఎన్ని వన్నెలో..! మండు వేసవిలో తిమిరాన్నంటుకుని చిరుగాలులకు బద్ధకంగా పైకి లేచే ధూళి కణాలపై ఉదయ రవి కిరణాలకు ఎన్ని వర్ణాలో..! బుచ్చెయ్యపేటలో శుక్రవారం ఉదయం సూర్యోదయ వేళ ఆకాశంలో పరచుకున్న రంగుల్ని చూసి ప్రకృతి ప్రియులు ముగ్ధులయ్యారు.

\- బుచ్చెయ్యపేట

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ బెంగళూరు–ఖరగ్‌పూర్(06507) సమ్మర్ స్పెషల్ ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.02 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 2.45 గంటలకు ఖరగ్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను జూన్ 14 వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్–బెంగళూరు (06508) సమ్మర్ స్పెషల్ ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.40 గంటలకు అదేరోజు రాత్రి 7.50 గంటలకు బెంగళూరు వెళ్తుంది. ఈ స్పెషల్‌ను జూన్ 17 వరకు పొడిగించారు.

◆ ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(06585) సమ్మర్ స్పెషల్ ప్రతీ శుక్రవారం మధ్య రాత్రి 12.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి అదే రోజు రాత్రి 7.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.27 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు హౌరా వెళ్తుంది. ఈ స్పెషల్ జూన్ 14 వరకు నడుస్తుంది. హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(06586) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారం మధ్యాహ్నం 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 3.03 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.05 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.10 గంలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది. ఈ స్పెషల్‌ను జూన్ 15 వరకు పొడిగించారు.

◆ ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి (06569) సమ్మర్ స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.55 గంటలకు బయలుదేరి మంగళవారం తెల్లవారు 5.30 గంటలకు గౌహతి వెళ్తుంది. ఈ స్పెషల్ జూన్ 9వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో గౌహతి–ఎస్ఎంవీ బెంగళూరు(06570) సమ్మర్ స్పెషల్ గౌహతిలో ప్రతీ బుధవారం ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.10 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది. ఈ స్పెషల్‌ను జూన్ 12వ తేదీ వరకు పొడిగించారు.

◆ ఎస్ఎంవీ బెంగళూరు- మాల్దా టౌన్(06563) స్పెషల్ రైలు ఎస్ఎంవీ బెంగళూరులో జూన్ 9 రాత్రి 11.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 6.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.15 గంటలకు బయలుదేరి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మాల్దా టౌన్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో మాల్దా టౌన్- ఎస్ఎంవీ బెంగళూరు(06564) స్పెషల్ జూన్ 12 సాయంత్రం 4 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది.

◆ మైసూరు–ముజఫర్‌పూర్(06221) స్పెషల్ జూన్ 10వ తేదీ సోమవారం మైసూరులో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముజఫర్‌పూర్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో ముజఫర్‌పూర్–మైసూరు (06222) స్పెషల్ జూన్ 13వ తేదీ గురువారం ముజఫర్‌పూర్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.40 గంటలకు మైసూరు వెళ్తుంది.

అలరించిన నాటిక పోటీలు

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నేడు, రేపు ప్రదర్శనలు


నాలోన నీవే నాటికలో ఓ దృశ్యం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో శుక్రవారం ప్రదర్శించిన నాటికలు ఆహూతుల్ని అలరించాయి. జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌కు చెందిన 1974–75 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలను ప్రారంభించారు. 17 నుంచి 19 వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అనకాపల్లి పట్టణం కళలకు పుట్టినిల్లని కొనియాడారు. ఏటా ఈ నాటిక పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తొలి రోజు నాలోన నీవే, అమృత హస్తం నాటికలను ప్రదర్శించారు.

ఆధునిక ఇల్లాలి కథ 'నాలోన నీవే'

గుంటూరు ప్రాంతానికి చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారిచే ప్రదర్శించిన 'నాలోన నీవే'నాటిక ఆహూతుల్ని ఎంతగానో అకట్టుకుంది. తల్లీ కొడుకుల బంధం, భార్య రాకతో కలిగిన కల్లోలం, భార్యలో మార్పు తెచ్చేందుకు భర్త ఆడిన నాటకం ప్రధాన ఇతివృత్తంగా నాలోన నీవే నాటిక ఆద్యంతం మెప్పించింది. తండ్రి చనిపోయిన శ్రీరామ్‌కు తల్లిపై ఉన్న అభిమానం, గౌరవం, ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై ఉన్న ప్రేమ, తన భర్త ప్రేమ పూర్తిగా తనకే సొంతం కావాలనుకునే ఆధునిక ఇల్లాలి వ్యధ కల్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

అన్నాచెల్లెళ్ల బంధం 'అమృత హస్తం'

ఒక తల్లి కడుపున పుట్టిన అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనురాగం ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న తరుణంలో ఆ బంధాల గొప్పతనం, నేటి సమాజానికి అవి ఎంత అవసరమే తెలిపేలా గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'అమృత హస్తం'నాటిక చాటిచెప్పింది. ప్రేమ పెళ్లి చేసుకుని భర్త దాష్టీకానికి గురవుతున్న చెల్లెల్ని భర్తతో సహా ఆదరించిన అన్న, ఆడపడుచు భర్త దురాశను ఆధునిక టెక్నాలజీతో చట్టం ముందు నిలబెట్టిన అతని భార్య తెలివి తేటలు ఇలా ప్రతి సన్నివేశం ప్రేక్షకుల మనసుల్ని దోచుకుంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేఎం నాయుడు, పీసీహెచ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం.. రూ.2 లక్షల ఆస్తి నష్టం


రాజాంలో మంటల్లో దగ్ధమవుతున్న పూరిల్లు

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గొర్లె శ్రీను శుక్రవారం ఇంట్లో దేవుడి మూలన ప్రమిదలో నూనె దీపం పెట్టి పూజ చేశారు. ఈ దీపం పడిపోయి మంటలు వ్యాపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మంటలు ఇంట్లో ఉన్న సామాన్లకు అంటుకుని ఇంట్లో ఉన్న తిండి గింజలు, బట్టలు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం జరిగినపుడు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో స్థానికులు భయపడి, మండల్ని ఆపేందుకు ప్రయత్నించలేదు. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మరికొన్ని రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశ్వేశ్వర్య టెర్మినల్ బెంగళూరులో శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరాల్సిన విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–అగర్తలా(12503)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి–ఎస్ఎంవీ బెంగళూరు (08845) సమ్మర్ స్పెషల్ మధ్య రాత్రి 12.30 గంటలకు బయలుదేరింది.

◆ శుక్రవారం ఉదయం 5.45గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం- సికింద్రాబాద్(20833) వందేభారత్ సుమారు 3 గంటలు ఆలస్యంగా 8.45 గంటలకు బయలుదేరింది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్–విశాఖపట్నం (20834) వందేభారత్ 2.15 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22807)ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఆరు గంటలు ఆలస్యంగా రాత్రి 11.55 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి–తాంబరం (06090) సమ్మర్ స్పెషల్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారు 4 గంటలకు బయలుదేరింది.

◆ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- హౌరా (12840) సూపర్‌ఫాస్ట్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరింది.

ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు రాకపోకలు సాగించనున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

క్లుప్తంగా

23న బుద్ధ జయంతి వేడుకలు

అనకాపల్లి: మండలంలోని శంకరం పంచాయతీ పరిధి బొజ్జన్నకొండ వద్ద ఈ నెల 23న బుద్ధ జయంతి(బుద్ధ పూర్ణిమ) వేడుకలు నిర్వహించనున్నట్లు సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 22 వరకు విద్యార్థులకు బొజ్జన్న కొండ చరిత్ర, విశిష్టతపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు జరపనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నాలుగు పేజీలకు మించకుండా తెలుగులో రాసిన వ్యాసాలను నేరుగా వాట్సప్ 89770 20615, 94932 56300 నంబర్లకు పంపించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 23న బొజ్జన్నకొండ వద్ద బహుమతులు అందిస్తామన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేగి నాగేశ్వరరావు, అనురాధ దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్క్ సెంటర్ గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం శ్రీ గౌరీపరమేశ్వరుల 192వ ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక వ్యాపారవేత్త వేగి నాగేశ్వరరావు, అనురాధ దంపతులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పాండూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం గౌరీ గీతా మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి వ్యవస్థాపకులు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండో విడత చందనం అరగదీత

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కొబ్బరితోటలో వేంచేసిన శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి వారికి సమర్పించేందుకు రెండవ విడత చందనం అరగదీత కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఆలయ ఆవరణలో చందనం అరగదీత, 23న వైశాఖ శుద్ధపౌర్ణమి రోజున స్వామికి రెండో విడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. చందన అరగతీత కార్యక్రమంలో పాల్గొనే భక్తులు 8121316268 నంబరును సంప్రదించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 699 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,200	5,100
మొదటి రకం	4,100	4,750
రెండో రకం	3,860	4,550
మూడోరకం	3,500	3,840

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

వేసవి కాలం.. పగటిపూట తారెత్తిస్తున్న ఎండలు. సాయంత్రం మబ్బులు పట్టిన ఆకాశం. అడపాదడపా చిరుజల్లులు. ఈ ఆకస్మిక వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఎక్కువ. ఈ కాలంలోనే డెంగ్యూ సోకే అవకాశం ఉంది. అందుకే వైద్య నిపుణులు ఆరోగ్యాలను భద్రంగా కాపాడుకోవాలని హెచ్చరిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ రోగాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ధైర్యం చెప్తున్నారు.

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి అవకాశం
- డెంగ్యూ, విష జ్వరాల నివారణకు వైద్య శాఖ చర్యలు
- దోమల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి



డెంగ్యూ నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం



దోమల నివారణకు నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల: వేసవి మలి దశకు చేరుకుంది. మండే ఎండలతో పాటు వానలు కూడా అధికంగానే కురుస్తున్నాయి. దోమల వ్యాప్తి పెరుగుతోంది. వాతవరణ మార్పుల కారణంగా పట్టణ, మండల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. అందుకే ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమయింది. ఎప్పటి నుంచే దోమల నియంత్రణకు ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పుడు జాతీయ డెంగ్యూ నివారణ వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దోమల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.

ఇంటింటికీ వైద్యం

నియోజకవర్గంలో జిల్లా వైద్యాలయం(ఎన్టీఆర్) ఆస్పత్రితో పాటు మూడు అర్బన్ హెల్త్ కేంద్రాలు ఉన్నాయి. తుమ్మపాల, తగరంపూడి, కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్య సేవలు అందిస్తోంది. గత నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ నెలలో వర్షాలు మొదలయ్యాయి. అక్కడక్కడ వర్షపు నీరు నిలిచి, దోమలు పెరిగి పలు రకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైద్య సిబ్బంది రోగులకు ముందుగానే ర్యాపిడ్ పరీక్షలు చేస్తున్నారు. డెంగ్యూ నిర్ధారణ అయితే వెంటనే రక్తకణాల పరీక్షలు జరిపి, పరిస్థితి తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగులకు రక్తం, ప్లేట్‌లెట్స్ కోసం రిఫర్ చేస్తున్నారు.

డెంగ్యూపై అప్రమత్తం

ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగ్యూ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో వైద్య ఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగ్యూ నివారణ వారోత్సవాల పేరిట ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏడిస్ దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుంది. ఈ దోమ నలుపు, తెలుపు చారలతో ఉంటుంది. అందుకే దీన్ని పులి దోమ అని కూడా అంటారు. ఈ దోమ శుభ్రమైన నిల్వ నీటిలోనే గుడ్లు పెడుతుంది. సూర్యోదయానికి రెండు గంటల ముందు, రెండు గంటల తర్వాత మాత్రమే ఎక్కువగా కుడుతుంది. ఈ దోమ జీవితకాలం రెండు వారాలు. మూడు సార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ఇంట్లోని బట్టలు, పరుపులు, కర్టెన్స్ వెనుక ఎక్కువగా దాక్కుని ఉంటాయి.

విశ్రాంతి, ప్రాథమిక చికిత్స

డెంగ్యూ, విష జ్వరాల చికిత్సకు నిర్దిష్టమైన మందులు లేవు. డెంగ్యూ జ్వరం ఉన్నపుడు ఎక్కువ విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవాలి. మూత్ర విసర్జన తగ్గడం, నోరు, పెదవులు పొడిబారడం, నీరసం, గందరగోళం, జలుబు, చేతులు, కాళ్లు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచన లేకుండా మందులు వాడరాదు.

డెంగ్యూ లక్షణాలు

- ఆకస్మిక అధిక జ్వరం(105 డిగ్రీలు)
- తీవ్రమైన తలనొప్పి, కళ్లు, కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు, అతిసారం
- చర్మంపై దద్దుర్లు(జ్వరం వచ్చిన 2-5 రోజుల తర్వాత)
- చిగుళ్లు, ముక్కు నుంచి చిన్నపాటి రక్తస్రావం

ముందస్తు నియంత్రణ మేలు

- డెంగ్యూ దోమలు కుట్టకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో శరీరం మొత్తం గుడ్డతో కప్పుకోవాలి. చిన్నపిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- దోమతెరలు, జాలీలు, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి.
- రసాయనాలతో పొగపెట్టడం, ఇళ్లలో మందులు చల్లడం చేయాలి.
- ఇంటిలో, ఇంటి పరిసరాలలో రోజుల తరబడి నిల్వ నీరు లేకుండా చూడాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, టైర్లు, వాటర్ కూలర్‌లు వంటి వాటిలో నీరు లేకుండా చూసుకోవాలి.

దోమల నివారణపై అవగాహన

ఇటీవలి వాతావరణ మార్పుల కారణంగా విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. అకాల వర్షాలతో ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. వాటి నుంచి రక్షణగా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్నాం. డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డెంగ్యూ కేసులు లేకుండా ప్రతి చోట ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ నుస్రత్ షమీమ్, వైద్యురాలు, పీహెచ్‌సీ, తుమ్మపాల

నేడు కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవం



అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము 5 గంటలకు అమ్మవారి పల్లకీ ఊరేగింపు, నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ జనార్దన స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే ఆలయ ముఖ మండపంలో ధాన్యాభిషేకం, లక్ష మల్లెలతో అర్చన, సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 102 రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన, ఊంజల్ సేవ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్



కశింకోట పీహెచ్‌సీలో అధిక రక్తపోటు దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, రోగులు

కశింకోట: అధిక రక్తపోటును ముందుగా గుర్తించకపోతే గుండెపోటుతోపాటు మూత్ర పిండాలకు హాని తప్పదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్‌గా పేర్కొన్నారు. దీన్ని గుర్తించి, క్రమం తప్పకుండా పర్యవేక్షించడాన్ని జీవన విధానంలో ఓ భాగంగా చేసుకోవాలన్నారు. ఈ లక్షణాలపై అవగాహన లేక ప్రజలు రక్తపోటును కనిపెట్టలేకపోతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తనాళాల్లో పీడనం ఎక్కువగా(140/90 అంతకు మించి) ఉన్నప్పుడు అధిక రక్తపోటుగా పరిగణిస్తారని పేర్కొన్నారు. వైద్యుల పర్యవేక్షణ, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, మద్యం, పొగాకుకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా చూసుకోవడం ద్వారా అధిక రక్తపోటును అదుపు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, రోగులతో రక్తపోటు దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో రోగాలు దూరం



తుమ్మపాల పీహెచ్‌సీలో రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు

అనకాపల్లి: నిత్యం వ్యాయామంతో పలు వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణీజగదీశ్వరి అన్నారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం మూడుసార్లు రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. రోజూ తీసుకునే ఆహారంలో 1.5 గ్రాముల కంటే తక్కువగా ఉప్పు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. బీపీ ఎక్కువగా ఉన్న రోగులు ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. అధిక బీపీ వల్ల గుండె, కిడ్నీ, లివర్ వంటి అవయవాలు పాడవడమే కాకుండా కంటి సమస్యలు బాధిస్తాయన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో డెంగ్యూకు చెక్



వాడచీపురుపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు కనకప్పారావు, క్రాంతి కుమార్ సిబ్బంది

పరవాడ: డెంగ్యూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడచీపురుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వి.కనకప్పారావు అన్నారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడచీపురుపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి కనకప్పారావు మాట్లాడుతూ ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోవడం, పరిసర ప్రాంతాల్లో తాగి వదిలిన కొబ్బరి బోండాలు, టైర్లు, నీటి తొట్టిలు, వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాలు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో దోమలు పెరగకుండా కిరోసిన్ వేయాలన్నారు. డెంగ్యూ జ్వరానికి త్వరగా చికిత్స తీసుకోవడం ద్వారా మరణాలను నియంత్రించవచ్చునని డాక్టర్ కనకప్పారావు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి కుమార్, ఎంపీహెచ్‌వో కృష్ణాజీ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంత షెడ్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో వ్యాపారుల సౌకర్యం కోసం షెడ్‌ల నిర్మాణానికి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. నాబార్డు, పంచాయతీ నిధులతో చిరు వ్యాపారుల కోసం రెండు షెడ్‌లు, రెండు టాయిలెట్లను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రామ స్వరాజ్య సేవా సమితి ఆధ్వర్యంలో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు స్థానిక బీజేపీ నాయకుడు గళ్లా రాజు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పుర్రె నరసింగరావు, అప్పికొండ అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్ని రాజీవ్, టీడీపీ, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్., పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీఎల్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, నునపర్తి, రావాడ, పరవాడ, భర్నికం, తానాం, పి.బోనంగి, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియా, గొర్లివానిపాలెం, జాజులవానిపాలెం, దేశపాత్రునిపాలెం, ఎస్.బోనంగి, కలపాక, వెన్నలపాలెం పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యలమంచిలి రూరల్: ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని వేగంగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని సింహాద్రి బార్ అండ్ రెస్టారెంట్‌కు సమీపంలో పాత జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో రేగుపాలేనికి చెందిన మల్లి రాకేష్,కొత్తపాలెంకు చెందిన బూకా రాజు గాయపడ్డారు. రేగుపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండగకు వెళ్లిన ముగ్గురు స్నేహితులు బైక్‌పై యలమంచిలి వస్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్నారు. బైక్ వెనుక ప్రయాణిస్తున్న ఇద్దరికీ కాళ్లు విరిగిపోయాయి.యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖకు తరలించారు.

హెచ్‌ఎంలపై చర్యల ఉపసంహరణకు వినతి

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో జాప్యం పేరిట జిల్లా వ్యాప్తంగా 227 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఆక్షేపణీయమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ ఏడాది మార్చి నెలలో నిధులు జమచేసి, మే నెల రెండో వారంలోగా పనులు పూర్తి చేయలేదని నోటీసులివ్వడం సరికాదన్నారు. మార్చి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక పనుల్లో నిమగ్నమయ్యారని, ఈ రెండు నెలల కాలంలో టెన్త్ పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్లు, సార్వత్రిక ఎన్నికల శిక్షణ, ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారని తెలిపారు. చర్యల్ని ఉపసంహరించుకోవాలని వినతిపత్రంలో కోరారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు చిట్టియ్య, బాబూరావు, సతీష్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణం జరిగిన ఉత్సవమూర్తులు



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగమ్మ సన్నిధిలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి కుంకుమార్చనలు చేశారు. అనంతరం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణ చేశారు.

వెంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ



పూజలందుకున్న వేంకటేశుడు



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

- రెండో రోజూ వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి:వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కొమరవోలు తల్లి ఉత్సవాలు



ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి నృత్యం



మైదాన చెరువు సమీపంలో బాణసంచా కాల్పులు

- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు

రోలుగుంట: కొమరవోలు తల్లి ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ముగిశాయి. కొమరవోలులో ఈ నెల 12న ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు ప్రతి మూడేళ్లకొకసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గ్రామంలో ఆవల గంగాదేవి ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవాన్ని మత్స్యకార కుటుంబాల వారు జరుపుకున్నారు. ఈ నెల 14న ఇటంశెట్టి వారి కళ్లాలు వద్ద పండగ నిర్వహించారు. ముగింపు రోజున ఇలవేల్పు కొమరవోలు తల్లి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా విద్యుత్ దీపాలతో వీధులు అలంకరించారు. రహదారికి ఇరువైపులా ప్రధాన కూడలి వద్ద ప్రదర్శించిన దేవతామూర్తులు విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఊరేగింపులో శక్తి డ్యాన్సులు, యువకుల నృత్యాలు విశేషంగా అలరించాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా భారీ బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు, ఎంపీటీసీ సభ్యులు గొర్లె వెంకటరమణ, బోశం దొరబాబు సారధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు

కె.కోటపాడు: వర్షాకాలం సమయాల్లో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి సోకకుండా ఉండేందుకు పెంపకందారులు తప్పనిసరిగా ఎంట్రో టాక్సీమియా(ఈటీ) వ్యాక్సిన్‌ను వేయించాలని పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 గొర్రెలు, మేకలకు ఈటీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మూడు నుంచి ఆర్నెల్ల వయస్సు గల గొర్రెలు, మేకలు ఈ వ్యాధి బారిన పడే పరిస్థితి ఉందన్నారు. గొర్రెలు, మేకలు పారుకోవడం వల్ల నీరసించిపోయి మరణిస్తాయని రైతులకు వివరించారు. ఈ నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా పశు సంవర్ధకశాఖ ద్వారా ఉచితంగా ఈటీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకూ నిర్వహిస్తామన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

మునగపాక: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తామని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జనుము 10 కిలోలు రూ.440, జీలుగ 10 కిలోలు రూ.440 కు అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు మునగపాక-2 రైతు భరోసా కేంద్రం వద్ద సంప్రదించాలన్నారు. ఆధార్‌కార్డు జెరాక్స్‌ను అందజేయాల్సి ఉంటుందన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజలంతా సోదరభావంతో మెలగాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: ప్రజలంతా సోదరభావంతో మెలగాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మండలంలోని గణపర్తి, చూచుకొండ, రామగిరి, మడకపాలెం, చెర్లోపాలెం తదితర గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయినందున కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ కూడా అమలులో ఉంటుందని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.